సాక్షి
పశ్చిమగోదావరి
శుక్రవారం । 1 । సెప్టెంబర్ । 2023



కొబ్బరి కొండంత అండ

కల్పవృక్షంగా ఖ్యాతిగాంచిన కొబ్బరి ఉంటే రైతులకు కొండంత అండే. కాయలే కాకుండా, వివిధ రకాలుగా ఉపయోగపడే కొబ్బరి ప్రాశస్త్యం ఎంత చెప్పినా తక్కువే. 8లో ▸



దేహదారుఢ్య పరీక్షలు

ఎస్సై పోస్టుల భర్తీలో భాగంగా మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ఉత్సాహంగా సాగాయి. గురువారం 476 మంది మహిళలు హాజరయ్యారు. 8లో ▸

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయంలో ఈనెల 8న సామూహిక వరలక్ష్మీ వ్రతాలను నిర్వహించనున్నట్టు ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.



న్యూస్‌రీల్

ప్రతిపక్ష హోదా కోసం చంద్రబాబు ఆరాటం

డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ ఎద్దేవా



తాడేపల్లిగూడెం రూరల్: రాష్ట్రంలో కనీసం ప్రతిపక్ష హోదానైనా నిలబెట్టుకునేందుకు చంద్రబాబు పవన్ కళ్యాణ్‌పై ప్యాకేజీ స్టార్ అనే ముద్ర వేశాడని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం రాత్రి మోదుగగుంట గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ప్యాకేజీ ఇవ్వలేదని ఏనాడైనా చంద్రబాబు చెప్పాడా? అని ప్రశ్నించారు. ఇటువంటి విషపూరితమైన ఆలోచనలతో చంద్రబాబు ముందుకెళ్తున్నాడన్నారు. రెండు లక్షల పుస్తకాలు చదివాను.. తాను మహాజ్ఞానిగా చెప్పుకునే పవన్ సిద్ధాంతపరంగా పార్టీని ముందుకు తీసుకెళ్లాలన్నారు. సిద్ధాంతం లేకుండా ప్యాకేజీ కోసం పార్టీ పెట్టినట్లుగా వ్యవహరిస్తున్నాడన్నారు. చంద్రబాబును అధికారంలోకి తీసుకురావడమే సిద్ధాంతంగా, ఆయనకు మేలు జరగడమే ధ్యేయంగా పని చేయడం సరికాదన్నారు. ఇదిలా ఉంటే, వార్డు మెంబర్‌గా కూడా గెలవలేని లోకేష్ సీఎం జగన్‌ని ఏకవచనంలో మాట్లాడుతున్నాడని విమర్శించారు. రూ.280 కోట్లు ఖర్చు చేసినా గెలవలేదని ఎద్దేవా చేశారు. దండయాత్రకు వచ్చినట్లుగా లోకేష్ అనే పిచ్చోడు మాట్లాడుతున్నాడన్నారు. రెండు వేల మంది గూండాలను తీసుకువచ్చి దౌర్జన్యం చేస్తున్నాడన్నారు. రెడ్ బుక్ పేరుతో పాదయాత్రలో నిలదీసిన వారి పేర్లను రాసుకుంటూ తాను అధికారంలోకి వచ్చిన తర్వాత జైల్లో వేయించాలని లోకేష్ చూస్తున్నాడని మండిపడ్డారు.

వైభవం.. పవిత్రారోహణం



దివ్య పవిత్రాలతో ప్రదక్షిణలు చేస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయంలో శ్రీవారి దివ్య పవిత్రోత్సవాల్లో భాగంగా గురువారం పవిత్రారోహణం వేడుక వైభవంగా జరిగింది. రెండు రోజులుగా ఆలయంలో ఉత్సవాలను పురస్కరించుకుని విశేష కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా ఉదయం ఆలయ యాగశాలలో హోమ కుండం వద్ద అగ్ని ఆరాధన, చతుర్ధ కలశ స్నపనను జరిపించారు. స్వామి, అమ్మవార్లకు అలంకరణలు చేసే పవిత్రాలను అర్చకులు శిరస్సుపై ఉంచుకుని మేళతాళాలు, మంగళ వాయిద్యాలతో ఆలయంలో ప్రదక్షిణలు చేశారు. అనంతరం గర్భాలయంలో మూలవిరాట్, అమ్మవార్లు, ఉత్తమమూర్తులకు అర్చకులు పవిత్రాలను ధరింపజేశారు. పవిత్రాంగ హోమం, శాంతి హోమాన్ని అట్టహాసంగా నిర్వహించారు.

బ్రహ్మకుమారీల రక్షాబంధన్



ఎస్పీ రవిప్రకాష్‌కు రాఖీ కడుతున్న బ్రహ్మకుమారీ

భీమవరం(ప్రకాశంచౌక్): ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం భీమవరం శాఖ ఆధ్వర్యంలో గురువారం రక్షాబంధన్ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శాఖ నిర్వాహకురాలు బ్రహ్మకుమారి రేవతి మాట్లాడుతూ రక్షాబంధన్ పర్వదినం సోదర సోదరీల అనుబంధాన్ని, ఆప్యాయతను, అనురాగాన్ని గుర్తుచేస్తుందన్నారు. ఈ పండుగతో విశ్వ సౌభ్రాతృత్వ భావన నెలకొంటుందని చెప్పారు. ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్, జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్, పట్టణ పుర ప్రముఖులకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

14న విద్యార్థులకు పోటీలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): హిందీ దినోత్సవం సందర్భంగా ఈనెల 14న విద్యార్థులకు జిల్లా స్థాయిలో వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఏలూరులోని హిందీ నికేతన్ కార్యదర్శి పి.కవితా కుమారి ఓ ప్రకటనలో తెలిపారు. 5,6,7 తరగతుల విద్యార్థులు జూనియర్, 8,9,10 తరగతుల విద్యార్థులు సీనియర్ విభాగాల్లో పాల్గొనాలని పేర్కొన్నారు. జూనియర్ విభాగంలో ఆధునిక సమాజ్ మే అనుశాసన్ కా పాత్ర (ఆధునిక సమాజంలో క్రమశిక్షణ పాత్ర) అనే అంశంపై వ్యాసరచన, జ్ఞానార్జన్ మే సమాచార్ పత్రోం కా యోగదాన్ (జ్ఞానార్జనలో సమాచార పత్రికల పాత్ర) అనే అంశంపై వక్తృత్వ పోటీలు, సీనియర్ విభాగంలో కబీర్ ఔర్ వేమన కే సాహిత్య కీ తులనా (కబీరు-వేమన సాహిత్యంలో వ్యత్యాసాలు) అనే అంశంపై వ్యాసరచన, విశ్వశాంతి కీ స్థాపనా మే భారత్ కీ భూమిక (విశ్వశాంతి స్థాపనలో భారతదేశ పాత్ర) అనే అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామని వివరించారు. వివరాలకు 94403 43295లో సంప్రదించాలని పేర్కొన్నారు.

● సర్కారీ బడి.. సాంకేతిక సవ్వడి

- డిజిటల్ తరగతులు
- ట్యాబ్‌ల్లో చదువులు





ట్యాబ్‌లలో పాఠాలను శ్రద్ధగా నేర్చుకుంటున్న విద్యార్థినులు



సందేహాలు నివృత్తి చేస్తున్న నోడల్ అధికారి శ్రీహరి

రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన విద్యావిప్లవంతో సర్కారీ బడుల్లో డిజిటల్ కాంతులు వెల్లివిరుస్తున్నాయి.. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా డిజిటల్ తరగతులు, ట్యాబ్‌ల్లో బైజూస్ యాప్ ద్వారా విద్యాబోధన ఆకట్టుకుంటున్నాయి.. ఉపాధ్యాయులు డిజిటల్ బోర్డుపై పాఠాలు బోధించడంతో పాటు ఏ సందేహం వచ్చినా విద్యార్థులకు ట్యాబ్‌ల్లోనే స్పష్టంగా అర్థమయ్యేలా వివరిస్తున్నారు. ప్రగతికి కట్టు'బడి' ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఏలూరు గాంధీనగర్ నగరపాలకోన్నత పాఠశాలలో డిజిటల్ విద్యాబోధన దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు



డిజిటల్ పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

వైద్య విద్యకు శ్రీకారం

- ఏలూరు మెడికల్ కాలేజీ సిద్ధం
- నేటి నుంచి తరగతులు ప్రారంభం
- తొలి విడతలో 112 ఎంబీబీఎస్ సీట్లు భర్తీ



విద్యారంభం కరిష్యామి: ఏలూరులో ప్రభుత్వ వైద్య కళాశాల భవనం

ఏలూరు టౌన్: ఏలూరు సరికొత్త శోభను సంతరించుకుంది. ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ వైద్య కళాశాల సిద్ధమైంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పంలో భాగంగా అధునాతన వసతులతో కళాశాల భవనం ముస్తాబైంది. ఏలూరు పాతబస్టాండ్ సమీపంలో డీఎంహెచ్‌ఓ కార్యాలయం వద్ద భవనం తళుక్కుమంటూ మెరుస్తోంది. ఇక్కడ శుక్రవారం నుంచి ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. సీట్ల భర్తీ ప్రక్రియకు సంబంధించి మొదటి కౌన్సెలింగ్‌లోనే విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి విశేష ఆదరణ లభించింది.

పరిచయ కార్యక్రమంతో.. కళాశాలలో శుక్రవారం ఎంబీబీఎస్ తరగతులు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు విద్యార్థులతో ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ పరిచయ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ 150 ఎంబీబీఎస్ సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ చేపట్టింది. విద్యార్థులకు ఏలూరు జీజీహెచ్‌లో హాస్టల్ వసతి కల్పించారు. బాలురు, బాలికలకు వేర్వేరుగా హాస్టళ్ల నిర్మాణం చేపట్టారు. హాస్టల్ నుంచి కళాశాల వరకు విద్యార్థులను చేరవేసేందుకు ఆర్టీసీ బస్సు ఏర్పాటుచేశారు. ఉదయం, సాయంత్రం రెండు సార్లు బస్సు నడుస్తుంది.

సీట్ల భర్తీ

జాతీయ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) మార్గదర్శకాలను అనుసరించి డాక్టర్ వైఎస్సార్ హెల్త్ యూనివర్సిటీ వైద్య విద్య సీట్ల భర్తీ చేపట్టింది. 150 ఎంబీబీఎస్ సీట్లకు తొలివిడతలో 112 సీట్లు భర్తీ చేశారు. ఆల్ ఇండియా కేటగిరీలో 22 సీట్లకు 15 మంది, రాష్ట్ర కన్వీనర్ కోటాలో 64 సీట్లకు 61 మంది, బీ కేటగిరీలో 43 సీట్లలో 34 మంది, సీ కేటగిరీలో 19 సీట్లకు ఇద్దరు విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. మరో రెండు సీట్లు స్పోర్ట్స్, ఎన్‌సీసీ, అమరవీరుల కోటాలో భర్తీ చేస్తారు. రెండో, మూడో విడత కౌన్సెలింగ్‌లు నెలాఖరులో పూర్తిచేస్తారు. తొలివిడత ప్రవేశాలు పొందిన వారిలో 64 మంది బాలికలు, 48 మంది బాలురు ఉన్నారు.

అన్ని రకాల ఏర్పాట్లూ సిద్ధం



మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ సీట్ల భర్తీ ప్రక్రియలో భాగంగా మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయ్యింది. 112 మంది ప్రవేశాలు పొందారు. శుక్రవారం మొదటి రోజు విద్యార్థుల పరిచయ వేదిక ఉంటుంది. వైద్య విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకున్నాం. అన్నిరకాల ఏర్పాట్లు సిద్ధం చేశారు. నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో వసతులు అందుబాటులోకి వస్తాయి.

– డాక్టర్ కేవీవీ విజయ్‌కుమార్, ప్రిన్సిపాల్, ఏలూరు వైద్య కళాశాల

ఫీజులు ఇలా..

తొలుత 15 శాతం (22) సీట్లను ఆల్ ఇండియా నీట్ ర్యాంకర్లతో భర్తీ చేస్తారు. ఇక మిగిలిన 128 సీట్లలో 50 శాతం (64 సీట్లు) రాష్ట్ర కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. ఈ రెండు కేటగిరీ విద్యార్థులు ఏడాదికి రూ.15 వేలు ఫీజు చెల్లించాలి. ఇక 'బీ' కేటగిరీలో 43 సీట్లను సెల్ఫ్ ఫైనాన్స్ సీట్లుగా పేర్కొంటూ భర్తీ చేస్తారు. వీటిని పొందిన విద్యార్థులు ఏడాదికి రూ.12 లక్షల ఫీజు చెల్లించాలి. చివరగా 'సీ' కేటగిరీలో 19 సీట్లను ఎన్ఆర్ఐలకు కేటాయిస్తారు. ఈ కేటగిరీలో రూ.20 లక్షల ఫీజు చెల్లించాలి.

పారదర్శకంగా ఓటర్ల సవరణ

కలెక్టర్ ప్రశాంతి

కాళ్ల: ఓటర్ల సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, తొలగింపులు, చేర్పులు, మార్పులు జాబితాలు ఆయా సచివాలయాల్లో డిస్‌ప్లే చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. గురువారం సీసలి, ఏలూరుపాడు గ్రామ సచివాలయాలను ఆమె తనిఖీ చేసి ఓటర్ల తొలగింపులు, మార్పులు, చేర్పుల జాబితాల రిజిస్టర్లు, కంప్యూటర్ డేటాను పరిశీలించి అధికారులకు సూచనలు ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 1,500 ఓటర్లు కన్నా ఎక్కువ మంది ఉన్న పోలింగ్ స్టేషన్ పరిధిలో కొత్త పోలింగ్ స్టేషన్ ఏర్పాటుచేస్తామన్నారు. ఓటర్ల జాబితాల వారీగా పోలింగ్ కేంద్రాల పునర్విభజన పక్కాగా ఉండాలన్నారు. నెలాఖరు నాటికి పోలింగ్ కేంద్రాల పునర్విభజన పూర్తిచేయాల్సి ఉందన్నారు. దీనిలో భాగంగా పోలింగ్ కేంద్రాల భవనాలు, పేరు మార్పులు ఉంటే ప్రతిపాదించాలన్నారు. మండలంలోని 62 పోలింగు స్టేషన్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి పూర్తిస్థాయి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ టీపీ కృష్ణారావును ఆమె ఆదేశించారు. బీఎల్‌ఓలు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

చురుగ్గా రహదారుల నిర్మాణం

భీమవరం (ప్రకాశంచౌక్): ప్రజాప్రయోజనాలకు తొలి ప్రాధాన్యమిస్తూ రహదారుల నిర్మాణం చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. భీమవరం కలెక్టరేట్‌లో పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ ఇంజనీరింగ్ అధికారులతో జిల్లాకు మంజూరైన రోడ్ల నిర్మాణాలపై ఆమె సమీక్షించారు. రోడ్లు, కల్వర్టుల నిర్మాణాలు వేగంగా పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రోడ్లు మరమ్మతులకు గురయ్యాయని వెంటనే నిర్మాణానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. నిర్మాణాలు పూర్తిచేసుకున్న మంచిలి, లంకలకోడేరు పీహెచ్‌సీలను అధికారులకు అప్పగించి వినియోగంలోకి రావాలన్నారు. ఆచంట, మేడపాడు పీహెచ్‌సీల పనులు తుది మెరుగులు దిద్ది జిల్లా వైద్యశాఖకు అప్పగించాలన్నారు. జ్యుడీషియల్ క్వార్టర్స్ మరమ్మతుల పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జిల్లా పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారి కె.శ్రీనివాసరావు, జిల్లా రహదారులు, భవనాలు శాఖ అధికారి బి.లోకేశ్వరరావు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



కేంద్ర బృంద అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కలెక్టర్‌ను కలిసిన కేంద్ర బృందం

సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్ 2021 బ్యాచ్ (గ్రూప్ 294ఎ) అండర్ ఫౌండేషన్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్లు బాసుదేవ యాదవ్, హేమంత్‌కుమార్, హిమాన్షు సైని, మయంక్ అగర్వాల్, నిశిత ఇందిరా, విశాల్ జిల్లాలోని విస్సాకోడేరు, మొగల్తూరు, శేరేపాలెం, తూర్పు తాళ్ల పెదమైనవానిలంక, మోగల్లు గ్రామాల్లో నాలుగు రోజులపాటు పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరును వారు పరిశీలించారు. దీనిలో భాగంగా గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.ప్రశాంతిని కలిసి పర్యటన వివరాలు తెలియజేశారు.

పీఓపీ విగ్రహాలు నిషిద్ధం

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ (పీఓపీ)తో చేసిన వినాయక ప్రతిమలు పూర్తిగా నిషిద్ధమని, విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి అని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక చతుర్థి జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. చవితి వేడుకలకు సంబంధించి ముందస్తు చర్యలు, అవగాహనపై చర్చించారు. వేడుకల నియమ, నిబంధనలు, అనుమతులను వివరించారు. 100 విగ్రహాలకు పైగా తయారు చేసేవారు రిజిస్ట్రేషన్ చేసుకుని ట్రేడ్ లైసెన్స్ పొందాలన్నారు.

26 మంది ఎస్సైల బదిలీ

భీమవరం (ప్రకాశంచౌక్): పశ్చిమగోదావరి జిల్లాలో 26 మంది ఎస్సైలను బదిలీ చేస్తూ జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాలిలా ఉన్నాయి.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
ఎస్‌కే మదీనా బాషా	వీఆర్, భీమవరం	పెనుమంట్ర పీఎస్
బి.నాగబాబు	వీఆర్, భీమవరం	ఆకివీడు పీఎస్
కె.రాజారెడ్డి	ఆకివీడు పీఎస్	డీఎస్‌బీ, భీమవరం
ఎస్.సత్యసాయి	వీఆర్, భీమవరం	డీఎస్‌బీ, భీమవరం
ఎన్‌వీవీ నాగేశ్వరరావు	అటాచ్డ్ టు డీఎస్‌బీ, భీమవరం	డీఎస్‌బీ, భీమవరం
ఎ.ఫణిమోహన్	అటాచ్డ్ టు ఆకివీడు పీఎస్	సీసీఎస్, భీమవరం
కె.చంద్రశేఖర్	ఇరగవరం పీఎస్	సీసీఎస్, భీమవరం
డి.ఆదినారాయణ	సీసీఎస్, భీమవరం	ఇరగవరం పీఎస్
కె.సుధాకర్‌రెడ్డి	నరసాపురం రూరల్ పీఎస్	తాడేపల్లిగూడెం టౌన్ పీఎస్
బి.రాజు	తాడేపల్లిగూడెం టౌన్ పీఎస్	తాడేపల్లిగూడెం రూరల్ పీఎస్
వీఎస్‌వీ భద్రరావు	తాడేపల్లిగూడెం రూరల్ పీఎస్	కాళ్ల పీఎస్
ఏజీఎస్ మూర్తి	కాళ్ల పీఎస్	వీఆర్, భీమవరం
ఫాజుల్ రెహ్మాన్	అటాచ్డ్ టు భీమవరం ట్రాఫిక్	భీమవరం వన్‌టౌన్ పీఎస్
వై.నాగలక్ష్మి	అటాచ్డ్ టు భీమవరం ట్రాఫిక్	భీమవరం ట్రాఫిక్ పీఎస్
బీఎస్‌డీఆర్ ప్రసాద్	అటాచ్డ్ టు నరసాపురం టౌన్	నరసాపురం టౌన్ పీఎస్
డి.రామ్‌కుమార్	అటాచ్డ్ టు పోడూరు పీఎస్	పోడూరు పీఎస్
ఎం.రాజ్‌కుమార్	అటాచ్డ్ టు ఆచంట పీఎస్	ఆచంట పీఎస్
బి.మోహనరావు	అటాచ్డ్ టు భీమవరం రూరల్	భీమవరం రూరల్ పీఎస్
కె.శ్రీనివాస్	అటాచ్డ్ టు తణుకు టౌన్ పీఎస్	తణుకు టౌన్ పీఎస్
సీహెచ్ జయలక్ష్మి	అటాచ్డ్ టు దిశ పీఎస్	దిశ పీఎస్, భీమవరం
హెచ్ రెహ్మాన్	డీఎస్‌బీ, భీమవరం	దిశ పీఎస్, భీమవరం, అటాచ్డ్ టు హైకోర్ట్ ఆఫ్ ఏపీ
జె.సతీష్	అటాచ్డ్ టు తణుకు ట్రాఫిక్	దిశ పీఎస్, భీమవరం, అటాచ్డ్ టు తణుకు ట్రాఫిక్ పీఎస్
ఆర్.బెన్నీ రాజు	అటాచ్డ్ టు హైవే మొబైల్	దిశ పీఎస్ భీమవరం, అటాచ్డ్ టు హైవే మొబైల్
ఎం.లక్ష్మణకుమార్	సీసీఎస్, భీమవరం	దిశ పీఎస్, భీమవరం, అటాచ్డ్ టు గంజా సెల్
సీహెచ్‌ఎస్‌ఆర్ రావు	అటాచ్డ్ టు డీసీఆర్‌బీ భీమవరం	డీసీఆర్‌బీ, భీమవరం
కె.నాగరాజు	వీఆర్, భీమవరం	డీటీపీసీ, పశ్చిమగోదావరి

పాలకొల్లులో విజయమే లక్ష్యం

- కష్టించి పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు
- ఎంపీ, ఉభయగోదావరి జిల్లాల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి



పాలకొల్లులో పార్టీ సదస్సులో మాట్లాడుతున్న ఉభయగోదావరి జిల్లాల ఇన్‌చార్జి, ఎంపీ మిథున్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ సుభాష్‌చంద్రబోస్, చీఫ్ విప్ ప్రసాదరాజు, పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీరంగనాథరాజు, నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల గోపి, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, కుడుపూడి సూర్యనారాయణ

పాలకొల్లు అర్బన్: సమష్టిగా పనిచేసి వైఎస్సార్ సీపీని పాలకొల్లులో గెలిపించడమే లక్ష్యంగా కార్యకర్తలు, నాయకులు పనిచేయాలని ఉభయగోదావరి జిల్లాల ఇన్‌చార్జి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పిలుపునిచ్చారు. పాలకొల్లు అడబాల గార్డెన్స్‌లో గురువారం ఏర్పాటుచేసిన పాలకొల్లు నియోజకవర్గ స్థాయి కార్యకర్తలు, నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివంగత సీఎం వైఎస్సార్ పిలుపిస్తే మెగాస్టార్ చిరంజీవిని ఓడించిన నియోజకవర్గమిదని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీకి బలమైన నాయకత్వం, ఓటు బ్యాంక్ ఇక్కడ ఉందన్నారు. ఇప్పటివరకు ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేసిన కవురు శ్రీనివాస్ ఎమ్మెల్సీగా ఎన్నికవ్వడంతో సీఎం జగన్ ఆలోచన చేసి బలమైన సామాజికవర్గం నుంచి, రాజకీయాలకు కొత్త వ్యక్తిగా గుడాల గోపిని ఇన్‌చార్జిగా నియమించినట్టు చెప్పారు. 2024లో గుడాల గోపియే వైఎస్సార్ సీపీ అభ్యర్థని, ఆయన్ని గెలిపించి సీఎం జగన్‌కి బహుమతిగా ఇవ్వాలని కార్యకర్తలను కోరారు. ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగే వ్యక్తి గోపి అని ఈ సందర్భంగా చెప్పారు. నియోజకవర్గంలో గృహ సారథులు, కన్వీనర్లు, గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ కన్వీనర్లు అందరూ కలిసి పనిచేస్తే పాలకొల్లు గెలుపు ఖాతాలో జమ అవుతుందని ధీమా వ్యక్తం చేశారు. బూత్ పరిధిలో ప్రతిఒక్కరూ కష్టించి పనిచేయాలన్నారు. పనిచేసిన ప్రతి కార్యకర్తకూ పార్టీ పదవులతో పాటు నామినేటెడ్ పదవులు ఇస్తామని, ఇంకా వ్యక్తిగతమైన పనులు చేసిపెడతామని హామీ ఇచ్చారు.

త్వరలో గడపగడపకు రెండో విడత

త్వరలో గడపగడపకు మన ప్రభుత్వం రెండో విడత కార్యక్రమం ప్రారంభమవుతుందని, వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గుడాల గోపిని ప్రతి ఇంటికీ తీసుకువెళ్లి పరిచయం చేయాలని కార్యకర్తలను ఎంపీ మిథున్‌రెడ్డి కోరారు. ఆయా గ్రామాల్లో ఏ పనులు చేయాలో జాబితాలు సిద్ధం చేయాలన్నారు. పంతాలు, పట్టింపులకు పోతే మీరు నష్టపోవడంతో పాటు మీ వెంట నడచిన కార్యకర్తలు కూడా నష్టపోతారని మిథున్‌రెడ్డి హెచ్చరించారు. ముందుగా వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరిగోపాలరావు (గోపి) అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీ మార్గాని భరత్‌రామ్, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనందప్రకాష్, ఎమ్మెల్సీలు కవురు శ్రీనివాస్, కుడుపూడి సూర్యనారాయణ, మండల పరిషత్ అధ్యక్షురాలు సబ్బితి సుమంగళి, జెడ్పీటీసీలు నడపన గోవిందరాజుల నాయుడు, గుంటూరు పెద్దిరాజు, చింతలపూడి, దెందులూరు పార్టీ పరిశీలకులు గుణ్ణం నాగబాబు, యడ్ల తాతాజీ, పార్టీ మండల కన్వీనర్లు ఎం.మైఖేల్‌రాజు, చందక సత్తిబాబు, పాత్తూరి బుచ్చిరాజు, కలిదిండి గణపతిరాజు, చిట్టూరి ఏడుకొండలు, ఎంఎస్ వాసు, పార్సి వెంకటరత్నం, గవర, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్లు బొడ్డేటి సూర్యనారాయణ, పెదపాటి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష ఫీజులు చెల్లించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): గత ఏప్రిల్‌లో జరిగిన 10వ తరగతి పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులు వచ్చే మార్చిలో జరిగే పరీక్షలకు హాజరుకావడానికి పరీక్ష ఫీజు చెల్లించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ ఓ ప్రకటనలో తెలిపారు. మూడు సబ్జెక్టుల వరకూ రూ. 110 చొప్పున, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులకు రూ.125 పరీక్ష రుసుం చెల్లించాలని, ఈనెల 5వ తేదీ వరకూ గడువు ఉందని పేర్కొన్నారు. అనుత్తీర్ణులై తిరిగి పాఠశాలలో ప్రవేశం పొందని విద్యార్థులకు మాత్రమే ఈ అవకాశం వర్తిస్తుందని తెలిపారు. ప్రధానోపాధ్యాయులు తమ పాఠశాల లాగిన్‌లోని పేమెంట్ గేట్‌వే ద్వారా మాత్రమే ఫీజులు చెల్లించాలని డీఈఓ సూచించారు.

క్లుప్తంగా

శ్రీవారి కాటేజీ డోనర్ స్కీంకు రూ.7 లక్షల విరాళం



విరాళం చెక్కును ఆలయ ఏఈఓ నటరాజా రావుకు అందజేస్తున్న దాత అన్నపూర్ణ

ద్వారకాతిరుమల: శ్రీవారి కాటేజీ డోనార్ స్కీంకు ఒక భక్తురాలు గురువారం రూ.7 లక్షలు విరాళంగా అందజేశారు. హైదరాబాద్‌కు చెందిన వి.అన్నపూర్ణ ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళం చెక్కును ఆలయ ఏఈఓ పి.నటరాజారావుకు అందించగా, ఆయన దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందజేశారు.

గ్రూపు దేవాలయాల ఈవోగా కొండలరావు



జంగారెడ్డిగూడెం రూరల్ : గ్రూపు దేవాలయాల ఈవోగా గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావును నియమిస్తున్నట్లు కాకినాడ దేవదాయ, ధర్మదాయ శాఖ ఉప కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. టి.నర్సాపురం మండలం బొర్రంపాలెంలోని శ్రీకోదండ రామస్వామి దేవస్థానం, జంగారెడ్డిగూడెం శ్రీ సీతారామస్వామి వారి దేవస్థానం, శ్రీవేణుగోపాల స్వామి దేవస్థానాలకు ఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహించేలా ఉత్తర్వులు ఇచ్చారు.

పలు రైళ్ల రద్దు

ఏలూరు (టూటౌన్): అనకాపల్లి–తాడి సెక్షన్ మధ్య రైల్వే ట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 4 వరకూ పలు రైళ్లను రద్దు చేశారు. మరి కొన్నింటిని పాక్షికంగా రద్దు చేశారు. మచిలీపట్నం–విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 30 నుంచి సెప్టెంబరు 3 వరకూ రెండు వైపులా రద్దు చేశారు. కాకినాడ పోర్టు–విశాఖ రైలు ఆగస్టు 31 నుంచి సెప్టెంబరు 4 ఇరువైపులా రద్దు చేశారు. విశాఖ–విజయవాడ మధ్య నడిచే ఉదయ్ ఎక్స్‌ప్రెస్, రాజమండ్రి–విజయవాడ ఎక్స్‌ప్రెస్ రైలు, గుంటూరు–విశాఖపట్నం సింహాద్రి ఎక్స్‌ప్రెస్‌ను ఇరువైపులా రద్దు చేశారు. సెప్టెంబరు 4 వరకూ ఈ రైళ్లు పూర్తిగా రద్దు చేశారు. తిరుపతి–విశాఖ మధ్య నడిచే రైలును సామర్లకోట వరకు(3వ తేదీ వరకు) విశాఖ–తిరుపతి మధ్య నడిచే రైలును సామర్లకోట నుంచి 3 నుంచి 5వ తేదీ వరకూ నడపనున్నారు. విజయవాడ–విశాఖపట్నం, విశాఖపట్నం–విజయవాడ మధ్య రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌ను 4వ తేదీ వరకు అనకాపల్లి వరకూ నడపనున్నారు. శ్రావణ మాసం పెళ్ళిళ్ల సీజన్ కావడంతో రెగ్యులర్‌గా తిరిగే రైళ్లల్లో ముందుగా రిజర్వేషన్లు చేసుకున్న ప్రయాణికులు ప్రత్యామ్నాయాల వైపు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కొబ్బరి.. కొండంత అండ

- కొబ్బరి పరిశోధనకు ఉద్యాన వర్సిటీ కృషి
- రేపు ప్రపంచ కొబ్బరి దినోత్సవం



అంబాజీపేటలోని కొబ్బరి పరిశోధనా స్థానం



గోదావరి గంగ కొబ్బరి చెట్టు



అభయగంగ కొబ్బరి చెట్టు

తాడేపల్లిగూడెం: కల్పవృక్షంగా ఖ్యాతిగాంచిన కొబ్బరి ఉంటే రైతులకు కొండంత అండే. కాయలే కాకుండా, వివిధ రకాలుగా ఉపయోగపడే కొబ్బరి ప్రాశస్త్యం ఎంత చెప్పినా తక్కువే. సెప్టెంబరు 2న ప్రపంచ కొబ్బరి దినోత్సవంగా జరుపుకుంటున్నారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో శాస్త్రవేత్తలు అంబాజీపేట, విజయరాయి పరిశోధనా స్థానాల్లో ఏటా కొత్త కొబ్బరి రకాలకు ఊపిరి పోస్తున్నారు.

గంగా బొండం మగ పొత్తు పుప్పొడికి, ఈస్టు కోస్టుటాల్ ఫిమేల్ పిప్పొడిని అద్ది.. కొత్త రకం గోదావరి గంగ రకం ఆవిష్కరణ చేశారు. అరలీటరు స్వచ్ఛమైన తీయని నీరు గంగా బొండం ప్రత్యేకం. గోదావరి గంగ, ఈస్టుకోస్టు టాల్, వశిష్ఠ గంగ, వైనతేయ గంగ, అభయ గంగ, గౌతమి గంగ, ఫిలిప్పీన్స్ ఆర్డనరీ, చౌగాట్ ఆరెంజ్ డ్వార్ఫ్, మలయాన్ ఎల్లో డ్వార్ఫ్ రకమేదైనా కొబ్బరి సాగు చేసే రైతుల బెంగను దూరం చేస్తాయి. అంబాజీపేట పరిశోధన స్థానంలో, తాజాగా విజయరాయి పరిశోధనాస్థానంలో జీవం పోసుకున్న ఈ కొబ్బరి మొక్కలు రైతు వ్యవసాయ క్షేత్రానికి చేరితే ఆ రైతుకు కొబ్బరి కాసుల రాశులే. రైతుల ఆశలకు అనుగుణంగా డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పరిధిలోని ఈ పరిశోధన స్థానాల్లోని శాస్త్రవేత్తలు రూపొందిస్తున్న కొబ్బరి రకాలు రైతులకు లాభాల బొండాలను అందిస్తున్నాయి. దేశవాళీ, సంకర రకాలు, విదేశీ రకాల కొబ్బరి మొక్కలకు అంబాజీపేటలో జీవం పోస్తున్నారు.

కొబ్బరితో ప్రయోజనాలెన్నో...

కొబ్బరి మానవుడికి అవసరమైన ఆహారం. ఆహారంగానే కాకుండా.. వంటచెరకు, కలప, తాళ్లు, నార వస్తువులు, బొగ్గు, నూనె, వంటివి అందిస్తుంది. కొబ్బరి పంటతో మానవుల అనుబంధాన్ని గుర్తించి ఏటా సెప్టెంబరు 2న ప్రపంచ కొబ్బరి దినోత్సవంగా జరపడానికి ఆసియా, పసిఫిక్ కొబ్బరి సమూహం ఇండోనేషియాలోని జకార్తాలో 2009లో ప్రపంచ కొబ్బరి దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించింది.

రాష్ట్రంలో విస్తీర్ణం

రాష్ట్రంలో కొబ్బరి 1.05 లక్షల హెక్టార్లలో సాగుచేస్తున్నారు. హెక్టారుకు సుమారుగా 15,964 కాయల సగటు దిగుబడి నమోదవుతుంది. ఉత్పాదకతను పెంచడంలో డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యానవిశ్వవిద్యాలయం, అంబాజీపేట ఉద్యాన పరిశోధనాస్థానం రైతులకు ఉపయోగపడుతూ, రైతుల ఆర్థిక స్వావలంబనకు దోహదం చేస్తుంది. రాష్ట్రంలో తొలి సంకర జాతి కొబ్బరి రకాన్ని 1991లో గోదావరి గంగ పేరుతో విడుదల చేశారు. 1993లో పొడుగు రకాల్లో ఫిలిప్పీన్స్ ఆర్డినరీ రకాన్ని డబుల్‌సెంచరీ పేరిట విడుదల చేశారు. జాతీయ స్థాయిలో సాగుకు అనువైన రకాల పరిశోధనలో భాగంగా కేరబస్తర్, కల్పప్రతిభ రకాలకు జీవం పోశారు. గంగాబొండం పొట్టిరకం, ఫిలిప్పీన్స్ ఆర్డనరీ టాల్ రకాలను సంకరం చేసి వశిష్ఠ గంగ రకాన్ని తయారుచేశారు. గంగా బొండం పొట్టి రకం, లక్కదీవి ఆర్డనరీ టాల్ రకాలు సంకరం చేసి అభయ గంగను రూపొందించారు. సంకర పద్ధతిలో వైనతేయ గంగ, గౌతమి గంగ రకాలకు జీవం పోశారు. గత పది సంవత్సరాల కాలంలో మూడు లక్షల దేశవాళీ రకాల మొక్కలు, 3.5 లక్షల గోదావరి గంగ, పదివేలకు పైగా గంగా బొండం ఇతర రకాలను రైతులకు అందించారు. హైబ్రీడ్ రకాల డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకొని కొబ్బరి అభివృద్ధి బోర్డు సహకారంతో కొబ్బరిలో సంకరీకరణపై నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమం ఉద్యాన పరిశోధనా స్థానం అంబాజీపేట చేపడుతోంది. గానోడెర్మా, నల్లమచ్చ తెగులు, మొవ్వకుళ్లు తెగులు, ఆకు ఎండు తెగుళ్ల నివారణకు రైతులకు మార్గదర్శనం చేస్తుంది.

ఇయర్ ఆఫ్ కోకోనట్

కొబ్బరిని విస్తరించే క్రమంలో ఉద్యాన విశ్వవిద్యాలయం 2021 సంవత్సరాన్ని ఇయర్ ఆఫ్ కోకోనట్‌గా ప్రకటించింది. వర్సిటీ పరిధిలో కొబ్బరి ఆవశ్యకతను గుర్తించి శ్రీకాకుళం జిల్లా బూర్జ మండలం పెదపేటలో 2022లో ఉద్యాన పరిశోధనా స్థానం ఏర్పాటుచేసి, కొబ్బరి అభివృద్ధి బోర్డు సహకారంతో పరిశోధనలు చేపడుతున్నారు.

కొబ్బరి రైతుల కోసం నిరంతర ప్రయోగాలు



రైతులకు ప్రపంచ కొబ్బరి దినోత్సవ శుభాకాంక్షలు. కొబ్బరి రైతుల కోసం నిరంతర ప్రయోగాలు జరుగుతున్నాయి. ఉద్యాన పరిశోధనా స్థానం అంబాజీపేట శాస్త్రవేత్తల కృషిని అభినందిస్తున్నాను. కొబ్బరి రైతుల అవసరాలను గుర్తించి తగిన సూచనలు, సలహాలు అందించడంతో పాటు, కొబ్బరి ఉప ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు పరిశోధనలు విస్తృతం చేస్తాం.

– డాక్టర్ తోలేటి జానకీరామ్, ఉపకులపతి, వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం

తలనీలాల వేలం ద్వారా రూ. 9.70 కోట్లు



తలనీలాల పాటదారుడి దంపతులను సత్కరిస్తున్న ఆలయ ఈఓ త్రినాథరావు

ద్వారకాతిరుమల: శ్రీవారికి భక్తులు సమర్పించే తలనీలాలను రెండేళ్ల పాటు (2023 నవంబర్ 13 నుంచి 2025 నవంబర్ 12 వరకు) పోగుచేసుకునే హక్కునకు ఆలయ అధికారులు స్వామివారి కల్యాణ మండపంలో గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. అందులో తణుకుకు చెందిన ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, తిరుపతికి చెందిన గరుడ ఎంటర్‌ప్రైజెస్, ఏలూరుకు చెందిన శ్రీనివాసా హెయిర్ ఇండస్ట్రీస్, ప్రొద్దుటూరుకు చెందిన కేవీ ఎంటర్‌ప్రైజెస్ వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేవీ ఎంటర్‌ప్రైజెస్ ఏడాదికి రూ. 9.70 కోట్లకు హెచ్చు పాటదారుగా నిలిచారు. గతేడాది స్వామికి తలనీలాల ద్వారా రూ. 7,37,15,400 ఆదాయం లభించిందని, దాంతో పోలిస్తే ప్రస్తుతం రూ. 2,32,84,600 ఆదాయం పెరిగిందని ఆలయ ఈఓ తెలిపారు. ఇ–ప్రొక్యూర్‌మెంట్, సీల్డ్ టెండర్, బహిరంగ వేలాన్ని నిర్వహించగా, బహిరంగ వేలంలో హెచ్చు ఆదాయం వచ్చిందన్నారు.

టీడీపీ హామీలు అమలు చేయలేదు

ఏలూరు (టూటౌన్): పోలవరం నిర్వాసితులకు హామీలు ఇచ్చే ప్రభుత్వాలు కాదని, వాటిని అమలు చేసే ప్రభుత్వాలు కావాలని సీపీఎం ఏలూరు జిల్లా కార్యదర్శి ఏ.రవి అన్నారు. యువగళం పాదయాత్రలో లోకేష్ పోలవరం నియోజకవర్గంలో పర్యటించిన సందర్భంగా ఆయన చేసిన వ్యాఖ్యలపై రవి స్పందించారు. గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలుగుదేశం అధికారంలో ఉన్నప్పుడు హామీలు ఇవ్వడమే తప్ప వాటిని అమలు చేసిన దాఖలాలు లేవన్నారు. 18 ఏళ్లు ఉన్నవారికి ప్యాకేజీకి అర్హులుగా 2017 కటాఫ్ తేదీగా ప్రకటించారన్నారు. నాడు హామీలు ఇచ్చారే తప్ప వాటిని అమలు చేయలేదన్నారు. పోలవరం నిర్వాసితులను రాజకీయ పార్టీలు తమ అధికారం కోసం హామీలు ఇవ్వడమే తప్ప వారికి న్యాయం చేసింది లేదన్నారు. ఎప్పుడో 10 సంవత్సరాల క్రితం ఇచ్చిన హామీలను లోకేష్ ఇప్పుడు అమలు చేస్తానని చెప్పడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. నిర్వాసితులకు ప్యాకేజీ పెంచి రూ.20లక్షలు ఇవ్వాలని కోరారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కార్యకర్తల చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలకు పార్టీ కండువాలు వేసిన డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: సీఎం జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు చేస్తున్న మేలు, పాలన పట్ల ఆకర్షితులై వైఎస్సార్‌సీపీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారని డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పేర్కొన్నారు. మండలంలోని నీలాద్రిపురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ మట్టా సత్యనారాయణ ఆధ్వర్యంలో సుమారు వంద మంది టీడీపీ కార్యకర్తలు గురువారం స్థానిక క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నమ్మి వచ్చిన వారికి పార్టీ అండగా ఉంటుందన్నారు. రాబోయే ఎన్నికల నాటికి పార్టీ బలోపేతానికి, విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కొట్టు విశాల్, దాసరి బులి వెంకటేశులు, దాసరి రాము తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు కృషిచేయాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ జిల్లా కార్యదర్శి జి.రాజేశ్వరి

ఏలూరు (టూటౌన్): బాలల సమగ్ర అభివృద్ధికి బాలల హక్కుల చట్టం దోహదం చేస్తుందని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి అన్నారు. స్థానిక జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవాధికార సంస్థ భవనంలో బాలల హక్కులు, బాల్యవివాహాలపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆదేశాల మేరకు న్యాయవిజ్ఞాన సదస్సు, న్యాయ సేవల శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలల హక్కుల్లో జీవించే హక్కు, రక్షణ పొందే హక్కు, అభివృద్ధి చెందే హక్కు, పాల్గొనే హక్కు ప్రధానమైనవన్నారు. బాధిత బాలలను ఆదుకునేలా చైల్డ్ లైన్ 1098కు ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ ఏవీఎస్ఎస్ మూర్తి మాట్లాడుతూ బాల్యం నుంచే బాలలకు అందాల్సిన హక్కుల్ని అవగాహన చేసుకొని తల్లిదండ్రులు వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలని తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ ద్వారా అవగాహన సదస్సులు నిర్వహించి ప్రజలకు చట్టాలపై అవగాహన పెంచుతున్నారని దీనిని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీసీపీఓ సూర్యచక్రవేణి, సీనియర్ న్యాయవాదులు పి.కృష్ణారావు, రామ్మోహనరావు, విభిన్న ప్రతిభావంతుల ఏడి ప్రభాకర్ బాలల హక్కులపై మాట్లాడారు. కార్యక్రమం అనంతరం న్యాయశాఖ సేవలకు సంబంధించి స్టాల్స్‌ను సందర్శించారు.

గడపగడపకు సంక్షేమం



తాడేపల్లిగూడెం రూరల్ : మోదుగుగుంటలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ



కాళ్ల : పెదఅమిరంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న పీఏఎల్ నర్సింహరాజు

ఉద్యోగ నియామక పత్రాల అందజేత

ఏలూరు(మెట్రో): ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగ కుటుంబ సభ్యులకు గురువారం సాయంత్రం జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి కారుణ్య నియామకం కింద ఐదుగురికి ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఐదుగురిలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ గ్రేడ్–2 కింద పులపర్తి బ్యూలా అనూషకు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లుగా చవటపల్లి వెంకటేశ్వరరావుకు, పాలవలసల దుర్గాప్రసాద్‌కు, డిజిటల్ అసిస్టెంట్లుగా కడిమి హర్షాదీప్, యడ్ల విమలకు నియామక పత్రాలను జేసీ అందజేశారు. క్రమశిక్షణతో విధులు నిర్వహించాలన్నారు.

మహిళా అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు





100 మీటర్ల పరుగులో పాల్గొన్న మహిళా అభ్యర్థులు , అభ్యర్థి ఎత్తును పరిశీలిస్తున్న పోలీస్ సిబ్బంది



లాంగ్ జంప్

ఏలూరు టౌన్: ఎస్సై పోస్టుల భర్తీకి రెండో దశ ఎంపిక పరీక్షలు ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో చేపట్టారు. పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో పోలీస్ ఎంపికలను ఏలూరు రేంజ్ డీఐజీ జీవీజీ అశోక్‌కుమార్ స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. దేహదారుఢ్య పరీక్షలకు సంబంధించి తొలి మూడు రోజులు పురుష అభ్యర్థులకు పోటీలు నిర్వహించారు. 30, 31 తేదీల్లో రెండు రోజులు మహిళా అభ్యర్థులు వివిధ పోటీల్లో పాల్గొని సత్తా చాటారు. జిల్లా ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి పోటీలను దగ్గరుండి పర్యవేక్షించారు. మహిళా పోలీస్ అధికారులతోనే స్క్రీనింగ్ టెస్టులు చేయించారు. ఎలాంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు. ఏలూరు రేంజ్ పరిధిలోని అభ్యర్థులకు పరేడ్ గ్రౌండ్స్‌లో ఐదు రోజుల పాటు వివిధ పోటీలు నిర్వహించారు. మొదటి మూడు రోజులు పోటీ పరీక్షలకు 1349 మంది పురుష అభ్యర్థులు హాజరైతే వారిలో 890 మంది అర్హత సాధించి తుది పరీక్షకు ఎంపిక య్యారు. 30న 458మంది మహిళా అభ్యర్థులకు ఆయా పోటీలు నిర్వహించగా వాటిలో 262 మంది అర్హత సాధించారు. ఆగస్టు 31న 476 మంది మహిళ అభ్యర్థులు హాజరయ్యారని అధికారులు తెలిపారు. డీఐజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. ఎస్సై పోస్టులకు నిర్వహిస్తున్న దేహదారుఢ్య పరీక్షలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా చేపడుతున్నామని చెప్పారు. అభ్యర్థుల శక్తి, సామర్థ్యాల ఆధారంగానే అర్హత సాధించే అవకాశం ఉందన్నారు. పోటీలకు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఈ ఎంపికల్లో జిల్లా అదనపు ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, కృష్ణాజిల్లా అదనపు ఎస్పీ ఆర్.శ్రీహరిబాబు, పెద్దాపురం డీఎస్పీ లతకుమారి, డీఎస్పీలు మున్న మురళీకృష్ణ, విజయ్‌పాల్, కే.ప్రభాకరరావు, సీఐలు, ఎస్ఐలు, మహిళా పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పేరుపాలెం బీచ్‌లో వ్యక్తి గల్లంతు

మొగల్తూరు: మొగల్తూరు మండలంలోని పేరుపాలెం వద్ద సముద్రం తీరంలో గురువారం స్నానానికి దిగిన ఓ వ్యక్తి గల్లంతైనట్లు మొగల్తూరు ఎస్సై వీరబాబు తెలిపారు. ఉత్తర ప్రదేశ్ నుంచి ఉపాధి నిమిత్తం వచ్చిన నలుగురు కార్మికులు గురువారం పేరుపాలెం తీరానికి విహారానికి రాగా సత్యేంద్ర సింగ్ (26) అనే వ్యక్తి గల్లంతైనట్లు తెలిపారు. భీమవరంలో పానీపూరి బండి నడుపుకుంటూ జీవిస్తున్న సత్యేంద్ర సింగ్‌కు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం రెండో పట్టణ ఏఎస్ఆర్ నగర్‌లో బుధవారం రాత్రి కుక్క అడ్డు రాగా.. ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఎం.కల్యాణ్ వర్మ (52) కిందపడడంతో తలకు గాయమై మృతి చెందినట్లు ఎస్సై పి.అప్పారావు చెప్పారు. తలకు గాయమైన అతను పట్టణంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు.

నాడు–నేడు పనులు వేగవంతం చేయాలి

ఏలూరు(మెట్రో): జిల్లాలో నాడు–నేడు కింద పాఠశాలల్లో నిర్మిస్తున్న అదనపు తరగతి గదులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ గౌతమీ సమావేశ మందిరంలో అధికారులతో మనబడి నాడు–నేడు రెండో దశ పనుల పురోగతిపై గురువారం సమీక్షించారు.

హెచ్ఐవీపై మరింత అవగాహన



5 కె రెడ్ రన్‌ను ప్రారంభిస్తున్న ఏలూరు ఆర్డీఓ కె.పెంచలకిషోర్

ఏలూరు(మెట్రో): హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ప్రజల్లో మరింత అవగాహన కలిగించేందుకు 5 కె రెడ్ రన్‌ను నిర్వహించినట్లు ఏలూరు ఆర్డీఓ కె.పెంచల కిషోర్ చెప్పారు. నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్, రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఇండోర్ స్టేడియం నుంచి 'నేషనల్ యూత్ ఫెస్ట్ -2023'' కార్యక్రమంలో భాగంగా 5 కె రెడ్ రన్ ఆర్డీఓ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 60 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డా. జీ.రత్నకుమారి మాట్లాడుతూ ఈ రన్‌లో గెలుపొందిన విజేతలకు నగదు పారితోషికాన్ని సెప్టెంబర్ నెల రెండో వారంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో నగదు బహుమతి అందజేస్తారన్నారు. విజేతలను తదుపరి రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు పంపిస్తామన్నారు. వీరితోపాటు ప్రతి జిల్లా నుంచి మరో 7 మందికి కన్సొలేషన్ కింద రూ.1,000 చొప్పున నగదు బహుమతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డా.నాగేశ్వర రావు, నెహ్రూ యువ కేంద్రం కోఆర్డినేటర్ డి.కిషోర్ పాల్గొన్నారు.

పందెంకోళ్ల విషయంలో ఘర్షణ

టి.నరసాపురం: మండలంలోని ఏపుగుంటలో పందెంకోళ్ల విషయంలో గురువారం ఇరువర్గాల మధ్య వివాదం తలెత్తింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం విశాఖపట్నానికి చెందిన ఒక వ్యక్తి ఇటీవల ఏపుగుంట గ్రామానికి చెందిన వీరంకి వెంకన్నబాబు వద్ద కొన్ని పందెంకోళ్లను కొన్నాడు. వాటిలో కొన్ని మేలు జాతి కావని, వెనక్కి తిరిగి ఇచ్చాడు. వెనక్కి ఇచ్చిన కోళ్లకు సంబంధించిన సొమ్ముకు బదులు మరికొన్ని పందెంకోళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఈ విషయంపై బుధవారం రాత్రి ఫోన్‌లో ఘర్షణ పడ్డారు. గురువారం ఏడుగురు వ్యక్తులు రెండు కార్లలో ఏపుగుంట వచ్చి కోళ్లను తీసుకువెళుతుండగా, వెంకన్నబాబు వారిని అడ్డుకున్నారు. ఆగ్రహించిన వారు వెంకన్నబాబును కొట్టారు. పలువురు గ్రామస్తులు అక్కడికి చేరుకోగా.. ఏడుగురిలో ముగ్గురు పరారు కాగా, మిగిలిన నలుగురికి దేహశుద్ధి చేశారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను స్టేషన్‌కు తరలించి తీసుకువెళ్లిన కోళ్లను వెనక్కి రప్పించే చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

ముత్యాలమ్మ దేవస్థానానికి 4 సెంట్ల స్థలం విరాళం



దేవస్థానానికి స్థలం పత్రాలను అందజేస్తున్న దాతలు ప్రభాకరరావు-రమాదేవి దంపతులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం ముత్యాలమ్మవారి దేవస్థానానికి జగన్నాథపురం గ్రామానికి చెందిన కాకర్ల కాశీ విశ్వేశ్వర సుబ్రహ్మణ్య ప్రభాకర రావు – రమాదేవి దంపతులు విజయదశమిని పురస్కరించుకుని గురువారం సర్వే నెంబరు 367/1 లోని నాలుగు సెంట్లు (196 చదరపు గజాలు) భూమిని దానంగా అందజేశారు. ఇందుకు సంబంధించిన డాక్యుమెంట్లను ఆలయ కమిటీ వారికి అందజేశారు. అనంతరం దాతలకు అమ్మవారి కృపటాక్షాలు కలగాలని ఆలయ అర్చకులు వేదాశీస్సులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయకమిటీ చైర్మన్ మాకా బాలాజీ, ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరేరామ్‌ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ప్రవచనం



ఆధ్యాత్మిక ప్రవచనం చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: స్థానిక రామచంద్రరావుపేటలోని కృష్ణ యోగ ధ్యానమందిరంలో శ్రావణమాసం పురస్కరించుకొని గురువారం ఆధ్యాత్మిక ప్రవచనం జరిగింది. టీటీడీ సహకారంతో నల్గొండ వేదపాఠశాల అధ్యాపకులు కస్తూరి అయోధ్యశర్మ రక్షాబంధన్ విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో హిందూ ధర్మప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంటు సుబ్రహ్మణ్యం, గాదంశెట్టి లక్ష్మీ కుమారి, మోహనరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై నిరసన



సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపడుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో గురువారం తాడేపల్లిగూడెం పట్టణంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, అధిక ధరలు తగ్గించాలని, పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమాన్ని యాగర్లపల్లి, రామచంద్రరావుపేటల్లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, పోతు శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు



కృష్ణాయపాలెం గ్రామంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని మాధవరం, కృష్ణాయపాలెం గ్రామాల్లోని ఎరువుల షాపుల్లో గురువారం మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కంపెనీలకు చెందిన ఎరువుల నమూనాలను సేకరించి రీజనల్ కోడింగ్ సెంటర్ తిరుపతికి పంపించినట్లు ఆయన తెలిపారు.

మావుళ్లమ్మవారికి బంగారం సమర్పణ

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం పట్టణ ఇలవేల్పు శ్రీమావుళ్లమ్మవారికి రాజమండ్రికి చెందిన మంగిన గోపాలకృష్ణ దంపతులు 8 గ్రాముల బంగారం సమర్పించారు. అదే విధంగా కాళ్ల మండలం కోపల్లెకు చెందిన బి.వరలక్ష్మి 4 గ్రాముల బంగారం అమ్మవారికి సమర్పించారు. వారికి ఆలయ సిబ్బంది అమ్మవారి ప్రసాదం, రసీదును అందచేశారు. ఆలయ ఈఓ, సహాయ కమిషనర్ యర్రంశెట్టి భద్రాజి, ధర్మకర్త తాళ్లపూడి భాగ్యలక్ష్మి, పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ ద్వారా సత్వర న్యాయం

ఆకివీడు: సత్వర న్యాయం కోసం లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని, సెప్టెంబర్ 9న జరుగనున్న లోక్ అదాలత్‌ను వినియోగించుకుని సత్వ ర న్యాయం పొందాలని న్యాయ సేవాధికార సంస్థ ప్యానల్ లాయర్ బంటుమిల్లి సురేష్ పిలుపునిచ్చారు. మండలంలోని దుంగపడప గ్రామ సచివాలయం వద్ద గురువారం చట్టాలపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ వలంటీర్లు ప్రజలకు లోక్‌అదాలత్‌ల గురించి వివరించాలన్నారు. చిన్న చిన్న సమస్యల్ని గ్రామ స్థాయిలో పరిష్కరించుకోవాలన్నారు. కోర్టులో ఉన్న సివిల్ కేసులు, మనోవర్తి, మోటార్ వెహికల్, ప్రమాద బీమా, ఇతర పెండింగ్ కేసులు, చెక్ బౌన్సు కేసులు, రాజీ చేసుకోదలచినవారు అర్జీ రూపంలో సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు.

ఇక సొంతింటి వారమండీ!

- జగనన్న కాలనీలలో జోరుగా ఇళ్ల నిర్మాణాలు
- పలుచోట్ల ఉత్సాహంగా గృహ ప్రవేశాలు
- సాకారమవుతున్న పేదల సొంతింటి కల
- హర్షం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



ప్రతిపాడు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్న దృశ్యం

పెంటపాడు: పేదల సొంతింటి కలను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారు. ఆయన అధికారంలోకి వచ్చిన ఏడాదికే దేశ చరిత్రలో కనీవిని ఎరుగని రీతిలో రాష్ట్ర వ్యాప్తంగా 31 లక్షల మంది పేదలకు ఇళ్లస్థలాలు మంజూరు చేశారు. లబ్ధిదారులు ఆయా స్థలాల్లో గృహాలు నిర్మించుకొనేందుకు అవసరమైన ఆర్థిక చేయూతను అందిస్తున్నారు. ఇంటి నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు సకాలంలో ఇసుక, సిమ్మెంట్, స్టీల్, వంటి సామాగ్రితో పాటు, బిల్లులు కూడా ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నారు. దీంతో జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. ఇంటి నిర్మాణం పూర్తయిన లబ్ధిదారులు గృహ ప్రవేశాలు చేస్తున్నారు.

ఆర్థిక సహకారం....

ఇంటి పట్టాలు పొందిన పేదలకు గృహనిర్మాణానికి అవసరమైన సామాగ్రిని తక్కువ ధరకు అందజేయటంతో పాటు, ఒక్కో ఇంటికి రూ. 1.80 లక్షలు నిధులను ప్రభుత్వం అందజేస్తోంది. పొదుపు సంఘాల్లో సభ్యులుగా ఉన్న మహిళలకు అదనంగా బ్యాంకు రుణం కింద రూ. 35,000 అందజేస్తున్నారు. దీంతో ఉత్సాహంగా లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు చేపట్టారు.

జగనన్న మేలు మరిచిపోలేం



నా భర్త వెల్డింగ్ పని చేస్తుంటారు. ఆ వచ్చే సొమ్ములతో జీవించే తాము ఇల్లు నిర్మించుకొంటామని కలలో కూడా అనుకోలేదు. మాకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. వారి గురించే బెంగ ఉండేది. అందుకే ఇంటిపై ఆశ వదులుకున్నాం. కానీ జగనన్న పుణ్యమా అంటూ జగనన్న కాలనీలో సొంతిల్లు కట్టుకున్నాం. ఇళ్లు పూర్తయిన తరువాత ఇది కలా, నిజమా అనే అనుమానం వస్తోంది. ఇద్దరు పిల్లలను కూడా భాగా చదివించుకోగలుగుతున్నాం

– రామవరపు నీలశ్రీ ప్రత్తిపాడు

సొంతింటి కల నెరవేరింది



తూర్పు ప్రాంతం నుంచి వచ్చిన మేము ఎన్నో ఏళ్లుగా సొంతిల్లు లేక అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాం. ఇంటి స్థలం కోసం సచివాలయంలో దరఖాస్తు చేసుకొన్నాం. అర్హత కలిగిన నాకు ప్రభుత్వం స్థలాన్ని మంజూరు చేయడంతో పాటు, గృహనిర్మాణ పథకం మంజూరు చేయడం ఇంటిని పూర్తి చేసుకొన్నాం. ప్రస్తుతం నా ఇంటివిలువ రూ. 12 లక్షలకు పైగా చేస్తుంది. ఈ కానుక ఇచ్చిన జగనన్నను ఎప్పటికి మరువలేను.

– పి. ఝాన్సీ, ప్రత్తిపాడు.

గృహ ప్రవేశం చేశాం



ప్రభుత్వం ఇంటి స్థలం మంజూరు చేయడంతో పాటు, గృహ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించింది. అధికారులు ఎప్పటి కప్పుడు బిల్లులు అందజేయడంతో త్వరితగతిన ఇంటిని పూర్తి చేసుకొని గృహప్రవేశం చేశాం. మా సొంతింటి కలను సాకారం చేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. నాకు ఫించన్ కూడా వస్తోంది. జగనన్నకు కృతజ్ఞతలు

– మజ్జి కుమారి ప్రత్తిపాడు జగనన్న కాలనీ

వేగంగా ఇళ్ల నిర్మాణాలు



జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయి. లబ్ధిదారులకు అవసరమైన మెటీరియల్ బిల్లులు పెండింగ్‌లో లేకుండా అందిస్తున్నాం. 80 శాతం మేరకు ఇంటి నిర్మాణాలు జరిగాయి. మిగిలిన వాటిని కూడా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటున్నాం.

– శివరామకృష్ణ, హౌసింగ్ ఏఈ పెంటపాడు

స్థల పరిశీలన చేసిన జేసీ



తూనికల కొలతలు శాఖ భవన నిర్మాణానికి స్థల పరిశీలన చేస్తున్న జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి

తాడేపల్లిగూడెం: పట్టణంలో గణేష్‌నగర్‌లో నిర్మించనున్న తూనికలు,కొలతలు శాఖ ఇనస్పెక్టర్ కార్యాలయం భవన నిర్మాణ నిమిత్తం కేటాయించిన స్థలాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్ రామ్ సుందర్‌రెడ్డి గురువారం పరిశీలన చేశారు. ఈ భవనం నిమిత్తం 5.50 సెంట్లు కేటాయించారు. ఈ స్థలానికి పరిశీలించి పలు సూచనలు చేశారు. స్థలం మ్యాపులను, భూమిని, పరిసరాలను పరిశీలించారు. ఆయన వెంట తహసీల్దార్ వై.దుర్గాకిషోర్, సర్వేయర్ రౌతు రామకృష్ణలు ఉన్నారు.

వైభవంగా అమ్మవారి జాతర

ఉండి: ఎన్నార్పీ అగ్రహారంలో జలసిద్ధి వినాయక యువజన, గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో మహంకాళమ్మ అమ్మవారి శ్రావణమాస లక్ష్మీవారాల జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహించారు. గురువారం గ్రామంలోని బీసీ కాలనీలోని ఆలయం నుంచి ప్రారంభమైన జాతర ఊరేగింపు ప్రధాన వీధుల మీదుగా ఉండి సెంటర్‌కు అక్కడ నుంచి మహంకాళమ్మ అలయానికి చేరుకుంది.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ
- మోదుగుగుంటలో గడపగడపకు మన ప్రభుత్వం



తాడేపల్లిగూడెం మండలం మోదుగ గుంట గ్రామంలో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రతి కుటుంబానికి సంక్షేమం అందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం రాత్రి తాడేపల్లిగూడెం మండలం మోదుగ గుంట, పుల్లాయగూడెం గ్రామాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించారు. అనంతరం డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రైతాంగం నుంచి అన్నివర్గాల ప్రజల వరకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ప్రతీ ఒక్క హామీని నెరవేర్చారన్నారు. దీన్ని చూసి చంద్రబాబుకు చిర్రెత్తుకొస్తుందన్నారు. రాష్ట్ర ప్రజలపై కక్ష తీర్చుకునేలా రాద్ధాంతం చేయాలని చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. కాపు సామాజికవర్గం చంద్రబాబుకు పూర్తి వ్యతిరేకమన్నారు. గతంలో కాపులను చంద్రబాబు మోసం చేయడమే కారణమన్నారు. కాపు సామాజికవర్గం అంటే చంద్రబాబుకు ద్వేషమన్నారు. ప్రజల్లో పవన్ కళ్యాణ్ క్రేజ్ పోయిందని, ప్రజల నమ్మకాన్ని పవన్ కోల్పోతున్నాడన్నారు. తొమ్మిది నెలల్లో ఎన్నికలు వస్తున్నాయని, కొత్త కొత్త హామీలతో ప్రజల ముందుకు చంద్రబాబు వస్తున్నాడన్నారు. గతంలో జగన్ సంక్షేమ పథకాల పేరిట రాష్ట్రాన్ని దివాలా తీయిస్తున్నాడని పచ్చమీడియా ద్వారా తప్పుడు సంకేతాలను ప్రచారం చేశాడన్నారు. కేంద్ర మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్ వేదికగా ఆర్థికంగా బలోపేతంగా ఉన్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ నాల్గవ స్థానంలో ఉందని పేర్కొనడంతో నోరు మెదపలేదన్నారు. దీంతో తాము కూడా అంతకన్నా మంచి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తామంటూ హామీలు గుప్పిస్తున్నాడన్నారు. అమ్మకు భోజనం పెట్టలేనోడు..పినతల్లికి పట్టుచీర పెడతానన్నట్టుగా చంద్రబాబు వ్యవహారశైలి ఉందన్నారు. చంద్రబాబు పేరు చెబితే పాదయాత్రలకు జనాలు రావడం లేదని ఎద్దేవా చేశారు. నాడు సీఎంజగన్ పాదయాత్ర చేస్తే వందలాది మంది జనాలు వచ్చారన్నారు. ప్రతీ ఒక్కరి సమస్యను సావదానంగా వినడం జరిగిందన్నారు. దీంతో ప్రజలు జగన్‌ను గెలిపించారన్నారు. ఇప్పటికైనా రాబోయే ఎన్నికల్లో చంద్రబాబు వంటి దుర్మార్గుడిని నమ్మితే న్యాయం జరుగుతుందా ? జగన్‌ను నమ్మితే న్యాయం జరుగుతుందో ప్రజలే ఆలోచన చేయాలన్నారు. జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, సర్పంచ్‌లు చీకట్ల పుష్పలక్ష్మీకుమారి, ఎలిపే గాంధీ, ఎమ్పీటీసీలు మార్లపూడి సుబ్బారావు, నార్ని శంకర రావు, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ; గుమ్మళ్ళ తాతారావు, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, సగర కార్పొరేషన్ డైరెక్టర్ కర్నాటి కన్నయ్య, డిప్యూటీ తహసీల్దార్ , ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఏపీఎం జీవీకేడీఎం.లక్ష్మి, హౌసింగ్ ఏఈ వైవీ.వెంకట్రావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, ఎలక్ట్రికల్ ఏఈ అల్లు రామకృష్ణ, డీఈవో–2 పీఎంకే.జ్యోతి, డీడీవో ఆర్‌వీ.బ్రహ్మం, పంచాయతీ కార్యదర్శి ప్రమీలారాణి, మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు నూనె రాధాకుమారి, చీకట్ల మల్లేశ్వరరావు, కామన చంద్రరావు, కట్టా జానకీరామయ్య, ఏపూరి సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గృహసారధులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నీలాద్రిపురం గ్రామంలో పాడి రైతులతో మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ అధికారులు

తాడేపల్లిగూడెం రూరల్: పాడి పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మురళీకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని నీలాద్రిపురం గ్రామంలో జగనన్న పాల వెల్లువ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ పశువుల మేతకు రూ.31వేలు, పాడి పశువుల కొనుగోలుకు లక్ష రూపాయల వరకు దీర్ఘ కాలిక రుణాలను అందించేందుకు కొమ్ముగూడెం సొసైటీ సిద్ధంగా ఉందన్నారు. రైతులు తమ పాడి అవసరాల కోసం రుణాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అమూల్ పాల సేకరణ కేంద్రానికి 250 లీటర్ల వరకు పాలు సేకరిస్తున్నారని, పాడి రైతులు ఈ రుణాలను వినియోగించుకుని, పాల ఉత్పత్తి పెరుగుదలకు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌కె. సుధాకర్, పశువైద్యాధికారి విజయ్, రవికుమార్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై సంతకాల సేకరణ



మాధవరం గ్రామంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన సమరభేరి కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని మాధవరం గ్రామంలో ప్రజా సమస్యలపై సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించడంలోనూ, ఉద్యోగావకాశాలు కల్పించడంలోనూ కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ శాఖ కార్యదర్శి పురిటిగడ్డ జయమ్మ, గుత్తుల నరసయ్య, గోపాల వెంకట్రావు, మంచాల పాపమ్మ, మల్లుల పరమేశ్వర్లు, వయ్యేరి, పాపమ్మ, గుత్తుల సత్యవతి, మంద రామారావు తదితరులు పాల్గొన్నారు.

బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న మండల కన్వీనర్ రాజేష్

తణుకు టౌన్: గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ పార్టీ సచివాలయ సారధులు, గృహ సారధులకు పార్టీ చేపట్టిన బీమా సౌకర్యం సద్వినియోగం చేసుకోవాలని తణుకు మండల సచివాలయాల జేసీఎస్ కన్వీనర్ కరిబండి రాజేష్ కోరారు. గురువారం తణుకు మండలం దువ్వ గ్రామంలోని 3వ సచివాలయంలో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సచివాలయ గృహ సారధులకు సంబంధించిన వివిధ అంశాలను ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు జంగం ఆనంద్‌కుమార్, గ్రామ కమిటీ అధ్యక్షుడు గోపాల కృష్ణ రైతు విభాగం అధ్యక్షుడు డీవీ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులపై దృష్టి పెట్టాలి

ఆకివీడు: సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి పెట్టాలని ఏడీఏ కె.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని కుప్పనపూడి గ్రామంలో పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఎరువులు, పురుగుమందుల వాడకంపై సూచనలిచ్చారు. అధికంగా పురుగు మందులు వినియోగంతో నష్టం తప్ప ఉపయోగంలేదన్నారు. మండల వ్యవసాయాధికారిణి ఎమ్మార్పీ ప్రియాంక మాట్లాడుతూ వేప కషాయంతో శత్రుపురుగులు నాశనం అవుతాయని చెప్పారు. కషాయం తయారీ విధానాన్ని రైతులకు స్వయంగా తెలియజేశారు. వేప కషాయం ఉపయోగాల్ని వివరించారు. రైతులు నంద్యాల చల్లారావు, ఎస్టీపీ రాఘవాచార్యులు, వీఏఏ లావణ్య, చందు పాల్గొన్నారు.

గూడెం టౌన్ ఎస్సైగా సుధాకర్‌రెడ్డి

తాడేపల్లిగూడెం: తాడేపల్లిగూడెం సర్కిల్ పరిధిలో సబ్‌ఇనస్పెక్టర్లు మారారు. ఈ మేరకు డీజీపి ఇచ్చిన ఉత్వర్వులలో గురువారం ఈ విషయాన్ని పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం పట్టణ ఎస్సైగా ఉన్న బోనగిరి రాజును గూడెం రూరల్ ఎస్సైగా పోస్టింగ్ ఇచ్చారు. గూడెం పట్టణ ఎస్సైగా నర్సాపురం రూరల్ ఎస్ఐగా పనిచేస్తున్న కె.సుధాకర్ రెడ్డిని నియమించారు. గూడెం రూరల్ ఎస్సైగా ఉన్న వీఎస్‌వి.భద్రరావును కాళ్ల ఎస్సైగా బదిలీ చేశారు.

పౌరహక్కుల దినోత్సవాన్ని తప్పక పాటించాలి



మాట్లాడుతున్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు మంగరాజు, తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో బాలాజీ

పెంటపాడు: పౌరహక్కుల దినోత్సవాన్ని ప్రతీ వ్యక్తి తప్పక పాటించాలని తహసిల్దార్ జీవీ శేషగిరిరావు పేర్కొన్నారు. పెంటపాడు బీసీ హస్టల్ సమీపంలో సచివాలయం వద్ద గురువారం సాయంత్రం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజల సమస్యలను తెలుసుకొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు మాట్లాడుతూ జస్టిస్ పున్నయ్య కమిటీ సిపార్సులు కచ్చితంగా అమలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ చట్టాలు ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమాలకు రాని అధికారులపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలన్నారు. గతప్రభుత్వాలు పౌరహక్కుల దినోత్సవాలు సరిగా నిర్వహించలేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీలపై ప్రేమతో అధికారులకు ఆదేశాలు ఇచ్చి ఈ కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పెంటపాడు ఎంపీడీవో బాలాజీ, ఎస్సీ బాలుర వసతిగృహ వెల్ఫేర్ అధికారి రామలింగం, లోక్ అదాలత్ లాయర్ చెక్కా ఇజ్రాయేలురాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధికి సహకరించాలి

భీమవరం(ప్రకాశంచౌక్): పుట్టి పెరిగిన గ్రామానికి సీఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులు చేసి ప్రజల మన్నన పొందాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో సీఎస్ఆర్ (కార్పొరేటు సోషల్ రెస్పాన్స్) నిధుల వినియోగంపై పారిశ్రామిక, ఆక్వా రైతులు, సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. గత ఏడాది సీఎస్ఆర్ నిధులతో ఆశించినంతగా పనులు జరగలేదన్నారు. ఆదాయంలో 2 శాతం సీఎస్ఆర్ కింద అభివృద్ధి కార్యక్రమాలు తప్పనిసరిగా చేయాలన్నారు. గేల్స్ అథారిటీ వారికి ఈ ఏడాది రూ.1.30 కోట్లు కింద పనులు చేపట్టాలని ప్రదిపాదనలు పంపించామన్నారు. ఆంధ్రా సుగర్స్ రూ.10 లక్షలు, వాన్ బెర్రీ కంపెనీ రూ.1 లక్ష నిధులను సీఎస్ఆర్ కింద డిపాజిట్ చేశారన్నారు. ఓఎన్జీసీకి రూ.70 లక్షలు, వసుధ ఫౌండేషన్ స్కూల్ అభివృద్ధికి రూ.60 లక్షలతో ప్రతిపాదనలు పంపించామన్నారు. జిల్లా అభివృద్ధికి ఉత్సాహంగా ముందుకు రావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

విజయవంతంగా గడప గడపకు మన ప్రభుత్వం

- తణుకు నియోజకవర్గంలో 117వ రోజు...
- గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మునిసిపాలిటీలో రూ. 3.40 కోట్లు పనులు



తణుకులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న మంత్రి కారుమూరి (ఫైల్)

తణుకు అర్బన్: జగనన్న ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ప్రజలకు సుపరిపాలన అందిస్తూనే మరోపక్క గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం ద్వారా సంక్షేమం అర్హులందరికీ అందుతుందా లేదా అనేది నిర్ధారణతోపాటు స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపుతుంది. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజానీకం, మహిళలు జగనన్న ప్రభుత్వాన్ని స్వాగతిస్తున్న తీరు సంక్షేమ పాలనకు అద్దం పడుతోంది. ఇంటి గుమ్మంలోకి వెళ్లగానే జగనన్న మాకు ఈ పథకం ఇచ్చారని, ఇంటి స్థలం ఇచ్చారని మహిళలు ముక్త కంఠంతో చెబుతున్నారు.

117 రోజులపాటు గడప గడపకు మన ప్రభుత్వం

తణుకు నియోజకవర్గంలో పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, అధికార యంత్రాంగంతో కలిసి 117 రోజులు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. తణుకు నియోజకవర్గంలో తణుకు మునిసిపాలిటీలోని 34 వార్డులతో పాటు తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా మంత్రి కారుమూరి ప్రజల్లో ఉంటున్నారు. ముఖ్యంగా మహిళలు సంక్షేమ పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పొగడ్తలతో ముంచేస్తూ మంత్రి కారుమూరికి హారతులు పడుతున్నారు. దీంతో పాటు స్థానికంగా ప్రజానీకం తెలిపిన సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నారు.

తణుకు మునిసిపాలిటీలో రూ. 3.40 కోట్లు పనులు

తణుకు మునిసిపాలిటీ పరిధిలోని 27 సచివాలయాలకు సంబంధించి ఇప్పటివరకు 17 సచివాలయాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయ్యింది. సచివాలయానికి రూ.20 లక్షలు చొప్పున ప్రభుత్వం అందించిన ప్రత్యేక నిధులను సద్వినియోగ పరుస్తూ ప్రజలు తెలిపిన సమస్యల పరిష్కారానికి గాను ఇప్పటివరకు రూ. 3.40 కోట్లు అభివృద్ధి పనులు చేపట్టగా, అందులో రూ. 2.40 కోట్లు పనులు పూర్తి కాగా మరొక రూ. 1 కోటి పనులు నిర్మాణ దశలో ఉన్నాయి. ముఖ్యంగా రహదారులు, డ్రెయినేజీలు కార్యాచరణ చేసి చేపడుతుండగా విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్యం, తాగునీటి కుళాయిలకు సంబంధించి వచ్చిన ఫిర్యాదులను అధికారులు అదే రోజు పరిష్కరిస్తున్నారు. దీంతో గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా అభివృద్ధి, సంక్షేమం రెండూ అందుతున్నాయంటూ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజల మన్ననలు పొందుతున్నాం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి వెళ్లడం వారి సమస్యలను తెలుసుకుని తక్షణమే పరిష్కరిస్తుండడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారు. కార్యక్రమంలో మంత్రివర్యులు కారుమూరి దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన ప్రతి సమస్యను ఆయన ఆదేశాల మేరకు పరిష్కారం దిశగా కృషిచేస్తున్నాం. రహదారులు, డ్రెయినేజీల నిర్మాణాలు నిబంధనల మేరకు టెండరు ప్రక్రియ పూర్తిచేసి పనులు చేపడుతుండగా చిన్నపాటి మరమ్మతులు, తాగునీటి సమస్యలను తక్షణమే పరిష్కరిస్తున్నాం.

– కేటీ సుధాకర్, మునిసిపల్ కమిషనర్, తణుకు